# రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోళ్లు

- జడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపికాయుగేంధర్‌రావు


సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపికాయుగేంధర్‌రావు

సూర్యాపేట, నవంబర్ 13 : రైతులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా వాన కాలం ధాన్యంను కొనుగోలు చేయాలని అందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని జడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపికాయుగేంధర్‌రావు అధికారులకు సూచించారు. సోమవారం జడ్పీ సమావేశ మందిరంలో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని, అకాల వర్షం వస్తే ధాన్యం తడువకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. విద్యుత్ అధికారులు గ్రామాల్లో ఉన్న లూజ్ వైర్లు, వంగిన, శిథిలావస్థలో ఉన్న స్థంబాలు ఎక్కడ ఉన్నా వాటిని వెంటనే మార్చి కొత్తవి ఏర్పాటు చేయాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పల్లె దవాఖానల్లో మెరుగైన వైద్య సేవలు అందేలా వైద్యాధికారులు చూడాలని పేర్కొన్నారు. సమావేశంలో జడ్పీ సీఈఓ సురేశ్, జడ్పీటీసీలు దయాకర్‌రెడ్డి, పుల్లారావు, సైదిరెడ్డి, ఎంపీపీ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

# సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెడితే కేసులు


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట సిటీ, నవంబర్ 13 : జిల్లాలో ఎన్నికల నియమావళిని అధికార యంత్రాంగం పటిష్టంగా అమలు చేస్తున్నది. రాజకీయ నాయకులు, పార్టీలను ఉద్దేశించి అనుచిత, రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు, ఫొటోలు ప్రచారం చేయడంతో బాధితుల ఫిర్యాదు మేరకు సూర్యాపేట పట్టణ పీఎస్‌లో అలాగే మునగాల పీఎస్‌లో కేసులు నమోదైనట్లు ఎస్పీ రాహుల్ హెగ్డే సోమవారం తెలిపారు. సోషల్ మీడియా ప్రత్యేక నిఘా ఉంటుందని చెప్పారు. జిల్లా ఎన్నికల అధికారి, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సోషల్ మీడియా మానిటరింగ్ సెంటర్ ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేస్తున్నట్లు వెల్లడించారు. రెండు కేసుల్లో మొబైల్ ఫోన్స్, ల్యాప్‌టాప్‌లు సీజ్ చేయడం జరిగిందన్నారు. అలాగే వాట్సాప్ అడ్మిన్‌పై కూడా చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు.

# కాళోజికి ఘన నివాళి


కాళోజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కళావేదిక సభ్యులు

బొడ్రాయిబజార్, నవంబర్ 13 : ప్రజా కవి కాళోజీ నారాయణరావు వర్ధంతిని పురస్కరించుకుని కళావేదిక ఆధ్వర్యంలో సోమవారం స్థానిక విశ్వ బ్రాహ్మణ విశ్వకర్మ సంఘ కార్యాలయంలో కాళోజి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కళావేదిక అధ్యక్షుడు పోతుగంటి వీరాచారి, జిల్లా కన్వీనర్ హమీద్‌ఖాన్ మాట్లాడుతూ.. కాళోజి తెలంగాణ అస్థిత్వాన్ని, బాష, యాసను ప్రపంచానికి ఎలుగెత్తి చాటారని, తెలంగాణ తొలి దశ ఉద్యమంలో కీలక భూమిక పోషించినట్లు తెలిపారు. కార్యక్రమంలో దేశోజు సైదాచారి, జి.రామసక్కం, శ్రీనివాసాచారి, మదనాచారి, నరసింహాచారి, ద్రోణాచారి, సైదాచారి, ఎస్.కె.పీర్‌సాబ్ పాల్గొన్నారు.

# ఘనంగా స్వాతి నక్షత్ర కల్యాణం


చివ్వెంల : లక్ష్మీనరసింహస్వామి వారికి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

చివ్వెంల, నవంబర్ 13 : మండలంలోని ఉండ్రుగొండ గిరి దుర్గంలో కొలువై ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం ఆశ్వీయుజ మాస స్వాతి నక్షత్రం సందర్భంగా ఆరుట్ల రవికుమారాచార్యులు, ఆలయ పూజారి కృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో లక్ష్మీనృసింహస్వామికి అత్యంత వైభంగా కల్యాణం జరిపించారు. కల్యాణ వేడుకను తిలకించేందుకు ఉమ్మడి నల్గొండ జిల్లాతో పాటు, హైదరాబాద్, ఏపీలోని గుంటూరు నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## విశ్వనాథ ఆలయానికి పోటెత్తిన భక్తులు..

బొడ్రాయిబజార్ : ఆశ్వయుజ మాసం చివరి సోమవారం జిల్లా కేంద్రంలోని అన్నపూర్ణ సహిత విశ్వనాథస్వామి దేవాలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయ ప్రధాన అర్చకుడు వలివేటి వీరభద్రశర్మ స్వామి వారికి అభిషేకం, అష్టోత్తర హారతి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎంపీ లక్ష్మణరావు, సహాయ అర్చకుడు సాగరశర్మ, సతీష్ పాల్గొన్నారు.

# అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి

- ఎవరికి వేసిన ఓటుతో ఏం జరిగిందో ఆలోచించాలి
- కాంగ్రెస్ నాయకులకు పదవులే ఎజెండా
- ప్రజా సంక్షేమమే బీఆర్‌ఎస్ ఎజెండా
- కాంగ్రెస్‌కు ఓటు వేస్తే కరువు, కరెంట్ కష్టాలు తప్పవు
- డాగులు వేయడానికి టైగర్‌ను కాదు.. మీ సేవకుడిని
- రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- చివ్వెంల, ఆత్మకూర్.ఎస్ మండలాల్లో విస్తృత ప్రచారం


ఆత్మకూర్.ఎస్ : కోటినాయక్‌తండా ప్రచారంలో మాట్లాడుతున్న రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

చివ్వెంల, నవంబర్ 13 : అభివృద్ధి చూసి ఆశీర్వదించాలని బీఆర్‌ఎస్ సూర్యాపేట నియోజక వర్గ అభ్యర్థి, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ప్రజలను కోరారు. మండలంలోని గాయంవారిగూడెం, గుర్రంతండా, టీకంతండా, బంగారితండా, ఎంజీనగర్‌తండా, సర్వీతండా, వాల్యాతండా, జగనతండా, భూక్యాతండా, మంగళితండా, లక్ష్మీనాయక్‌తండా, పులితండా, సేవాలాల్‌తండా,వట్టిఖమ్మంపహాడ్, పాచ్యానాయక్ తండా, బద్యాతండా, పిల్లలజెగ్గుతండా, అక్కలదేవిగూడెం, జయరాంగుడితండా, బండమీదిచందుపట్ల, మొగ్గయ్యగూడెం, భీమ్లాతండాలో మంత్రి సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నియోజక వర్గ ప్రజలు ఆరుసార్లకు పైగా ఓటేసిన అనుభవం ఉన్నదని, ఏవరికి వేసిన ఓటు ద్వారా మంచి జరిగిందో ఆలోచించాలన్నారు. కాంగ్రెస్‌కు వేసిన ఓటు రైతాంగాన్ని సర్వనాశనం చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ నాయకులకు పదవులే తప్పా ప్రజా సంక్షేమమే పట్టదన్నారు. 2014లో బీఆర్‌ఎస్‌కు వేసిన ఓటు కాళేశ్వరం జలాలు తెచ్చి ఇక్కడి బీడు భూములను సస్యశ్యామలం చేసినట్లు చెప్పారు. అలాగే రైతు బంధు, రైతు బీమా, 24 గంటల కరెంట్, కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్, రుణ మాఫీ వంటి ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలను తీసుకొచ్చినట్లు వివరించారు. మళ్లీ తనను ఆశీర్వదిస్తే రూ.2 వేల పింఛన్ 5 వేలు, దివ్యాంగులకు రూ.6 వేలు, కేసీఆర్ బీమా, సన్న బియ్యం, సౌభాగ్యలక్ష్మి కింద నెలకు రూ.3 వేలు, రూ.400కే గ్యాస్ సిలిండర్, ఇండ్లు లేని నిరుపేదలందరికీ ఇల్లు కట్టి ఇస్తామని తెలిపారు. నియోజక వర్గంలో ప్రతి గ్రామంలో ఇండ్లు కట్టించే బాధ్యత స్వయంగా తానే తీసుకుని శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. కర్ణాటకలో కాంగ్రెస్ 5 గంటలే కరెంట్ ఇస్తున్నదని మాజీ సీఎం కుమారస్వామి చేసిన వ్యాఖ్యలే నిదర్శనం అన్నారు. కావాలంటే కర్ణాటకలో 18 గంటలు విద్యుత్ వైర్లు పట్టుకుంటామని వారు తెలంగాణాలో ఒక్క నిమిషమైనా విద్యుత్ వైర్లు పట్టుకుని నిలబడడానికి సిద్ధమా అని సవాలు విసిరారు. గ్రామాల్లోకి వచ్చే కాంగ్రెస్ నేతలను ప్రజలు నిలదీయాలన్నారు. కాంగ్రెస్ వస్తే మళ్లీ చీకట్లు, కరువు తప్పదన్నారు. డాగులు వేయడానికి తాను టైగర్‌ను కాదన్న మంత్రి ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండే సేవకుడిని మాత్రమేనని తెలిపారు. సూర్యాపేటలోని ఐటీ హబ్ స్థానిక యువతకే ఉద్యోగాలు కల్పించేలా నాలుగు వేల ఉద్యోగాలకు విస్తరిస్తామన్నారు.10 వేల మంది నిరుద్యోగ యువతీయువకులకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా వెయ్యి ఎకరాల్లో పారిశ్రామిక పార్క్‌ను ఏర్పాటు చేసి ఉపాధి కల్పిస్తానని హామీ ఇచ్చారు. పదేండ్ల అభివృద్ధి, సంక్షేమ పాలన చూసి మరోసారి బీఆర్‌ఎస్ కారు గుర్తుకు ఓటేసి తనను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ధరావత్ కుమారీబాబూనాయక్, జడ్పీటీసీ భూక్యా సంజీవ్‌నాయక్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు జూలకంటి జీవన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మారినేని సుధీర్‌రావు, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రావిచెట్టు సత్యం, మాజీ ఎంపీపీ రౌతు నర్సింహారావు, జిల్లా నాయకులు గుర్రం సత్యనారాయణరెడ్డి, రామగిరి నగేశ్, ఊట్కూరి సైదులు, నాగరాజు, రవి, నాగయ్య పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తో ఒరిగిందేమీ లేదు..

ఆత్మకూర్.ఎస్ : రాష్ట్రాన్ని దశాబ్ధాలుగా పాలించిన కాంగ్రెస్ పాలనతో ఒరిగిందేమి లేదని మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. ఎవరికి వేసిన ఓటు ఏం తెచ్చిందో ప్రజలు ఆలోచించాలని కోరారు. సోమవారం ఆత్మకూర్.ఎస్ మండలం కోటినాయక్‌తండాలో మంత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. నియోజక వర్గంలో ఇండ్లు లేని ప్రతి పేదకు ఇల్లు కట్టించే బాధ్యత తనదేనన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే కరెంట్ కష్టాలు రావడం ఖాయమని, కర్ణాటక పరిస్థితులే ఇక్కడా పునరావృతం అవుతాయని తెలిపారు. చెప్పిన మాటపై నిలబడే నాయకుడు ఒక్క కేసీఆరే అని గత రెండు మ్యానిఫెస్టోలను వంద శాతం అమలు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణగౌడ్, ఎంపీపీ మర్ల స్వర్ణలతాచంద్రారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కొణతం సత్యనారాయణరెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు తూడి నర్సింహారావు, బత్తుల రాజేంద్రప్రసాద్, జిల్లా నాయకులు మర్ల చంద్రారెడ్డి, ముద్దం కృష్ణారెడ్డి, బెల్లంకొండ యాదగిరి, మిర్యాల వెంకట్‌రెడ్డి, సర్పంచ్ ధరావత్ మంగ, తంగెళ్ల మధుసూదన్ రెడ్డి, బ్రహ్మం, బీఆర్‌ఎస్ ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.


ఆత్మకూర్.ఎస్ : ప్రచారంలో పాల్గొన్న ప్రజలు

### స్వగ్రామంలో మంత్రి దీపావళి వేడుక

నాగారం : మంతరి జగదీశ్‌రెడ్డి దీపావళి వేడుకను నాగారంంలోని తన నివాసంలో కుటుంబ సభ్యులతో పాటు గ్రామానికి చెందిన చిన్నారులతో కలిసి జరుపుకున్నారు. చీకటిపై వెలుగు, అజ్ఞానంపై జ్ఞానం, చెడుపై మంచి సాధించిన విజయాలకు ప్రతీక దీపావళి పండుగ అని మంత్రి అన్నారు. ఈ నెల 30న కారు గుర్తుకు ఓటు వేసి డిసెంబర్ 3న అసలైన దీపావళి జరుపుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అలాగే మంత్రి ఇంటి ఆవరణలో మెట్లపై కూర్చొని గ్రామస్తులతో కాసేపు సరదాగా ముచ్చటించారు. ఊరు బాగోగులను, గ్రామస్తుల క్షేమ సమాచారాలను అడిగి తెలుసుకున్నారు. వేడుకల్లో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కల్లెట్లపల్లి ఉప్పలయ్య, రైతు బంధు సమితి మండల కో-ఆర్డినేటర్ గుండగాని అంబయ్య, ఉపాధ్యక్షుడు దోమల బాలమల్లు, చిల్లర చంద్రమౌళి, కడియం పరమేశ్వర్, గుంటకండ్ల ముకుందరెడ్డి, చిప్పలపల్లి సోమయ్య, మల్లేశ్, రాములు పాల్గొన్నారు.

### పరామర్శ..

సూర్యాపేటరూరల్ : మండలంలోని రామారం గ్రామ సర్పంచ్ బొల్లం నాగరాజు తండ్రి సత్తయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. సత్తయ్య మృతదేహాన్ని మంత్రి జగదీశ్‌రెడ్డి సందర్శించి పూలమాల వేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

# నేడు డైట్‌లో కళా ఉత్సవ్ పోటీలు

రామగిరి, నవంబర్ 13: నేడు బాలల దినోత్సవం సందర్భంగా జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నల్లగొండలోని డైట్ సమావేశ మందిరంలో మంగళవారం ఉదయం 10 గంటలకు జిల్లా స్థాయి కళా ఉత్సవ్ పోటీలను నిర్వహించనున్నట్లు డీఈఓ బి.భిక్షపతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అన్ని యజమాన్యాల పరిధిలోని 8 నుంచి 12వ తరగతి చదివే విద్యార్థులు పోటీల్లో పాల్గొనవచ్చని వెల్లడించారు. 10 అంశాల్లో జరిగే పోటీల్లో జిల్లా స్థాయి విజేతలను రాష్ట్ర స్థాయి పంపిస్తామన్నారు. జాతీయ స్థాయి విజేతలకు ప్రథమ బహుమతి రూ. 25 వేలు, ద్వితీయ బహుమతి రూ. 20వేలు, తృతీయ బహుమతి రూ.15 వేలు అందజేస్తారని పేర్కొన్నారు. అని పాఠశాలల ప్రధా నోపాధ్యాయులు విధిగా తమ పిల్లలను గైడ్ టీచర్ పర్యవేక్షణలో పోటీలకు పంపించాలని సూచించారు.